సాక్షి
వైఎస్సార్ జిల్లా
ఆదివారం । 19 । నవంబర్ । 2023



కులగణనలో భాగస్వాములు కావాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కుల గణన కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ కోరారు. - 8లో



పాలస్తీనాపై దాడులు ఆపాలి

పాలస్తీనాపై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులను ఆపాలని కోరుతూ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రొద్దుటూరులో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
33.9 /22.6

వాతావరణం

జిల్లాలో శనివారం 22.6 - 33.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

డాక్టర్ ఇండ్లకు పురస్కారం



ఇండ్ల రామసుబ్బారెడ్డి

ప్రొద్దుటూరు : జిల్లాలోని దువ్వూరు మండలం గుడిపాడు గ్రామంలో జన్మించి, విజయవాడలో ఉంటున్న ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు, రచయిత డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డికి విశాఖపట్టణానికి చెందిన లోక్‌నాయక్ ఫౌండేషన్ వారు 'జీవనసాఫల్య పురస్కారం' ప్రకటించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ మానసిక వైద్యశాస్త్రానికి ఒక గుర్తింపు, గౌరవం తెచ్చిన తొలి తెలుగు డాక్టర్‌గా ఆయనకు ఈ పురస్కారం అందిస్తున్నట్లు తెలిపారు. జనవరి 18న ఎన్‌టీఆర్, అమితాబచ్చన్ నాన్న హరివంశరాయ్ బచ్చన్‌ల వర్ధంతి సందర్భంగా విశాఖపట్నంలో ఇండ్ల రామసుబ్బారెడ్డికి పురస్కారం ప్రదానం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

స్నపన తిరుమంజనం

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామికి శనివారం వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ స్నపన తిరుమంజనం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సుప్రభాత సమయాన శ్రీరామచంద్రమూర్తికి పట్టు వస్త్రాలు, పుష్పాలు, ఫలాలు, అభిషేక సామగ్రి సమర్పించారు. గర్భాలయంలో సీతారామలక్ష్మణ మూర్తులను ఆభరణాలతో ముస్తాబు చేశారు. అనంతరం ఆలయ పండితులు వేద పారాయణం, సహస్ర నామార్చన, కుంకుమార్చన, మంగళహారతులతో విశేష పూజలు నిర్వహించారు.

రామయ్య సన్నిధిలో కేఎస్సార్



రంగమండపంలో కొమ్మినేని దంపతులను ఆశీర్వదిస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలోని సీతారామలక్ష్మణులను రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు(కేఎస్సార్) సతీ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు, అర్చకులు ఆలయ లాంఛనాలతో వారికి స్వాగతం పలికి, ఆలయ ప్రదక్షిణ కావించి, గర్భాలయంలోని మూల విరాట్‌కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు రంగమండపంలో సేద తీరి, స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. వీరి వెంట ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఆర్‌ఐ రమణ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఆభరణాల సమర్పణ



ఆభరణాలను అందజేస్తున్న ప్రదీప్ కుమార్

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో శనివారం మూల విరాట్‌కి బంగారు, వెండి ఆభరణాలు సమర్పించారు. కర్నూలువాసి ప్రదీప్ కుమార్ తన కుటుంబంతో కలిసి రెండు బంగారు ముత్యాల దండలు, ఒక వెండిహారం ఇచ్చారు. వీటి విలువ రూ.2,83,500 ఉంటుందని ఆలయ డిప్యూటీ ఈవో నటేష్ బాబు తెలిపారు.

21న కబడ్డీ జట్టు ఎంపిక

కడప స్పోర్ట్స్ : కడపలోని డీఎస్‌ఏ క్రీడామైదానంలో ఈనెల 21వ తేదీ జిల్లాస్థాయి సీనియర్ మహిళల విభాగం కబడ్డీ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు వైఎస్‌ఆర్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఒ.రవీంద్రారెడ్డి, ఆర్.వెంకటసుబ్బయ్య తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు 29 నుంచి డిసెంబర్ 1 వరకు కర్నూలు జిల్లా గోనెగండ్లలో నిర్వహించే 70వ ఆంధ్రా స్టేట్ సీనియర్ అంతర్ జిల్లా చాంపియన్‌షిప్‌లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 6304309294 నంబరులో సంప్రదించాలన్నారు.

హైపిచ్‌లో క్రికెట్ ఫీవర్



కడప ఆర్ట్స్ కళాశాల మైదానంలో బారికేడ్ల నిర్మాణం

- నేడు భారత్–ఆస్ట్రేలియా మధ్య ఫైనల్ మ్యాచ్
- భారత్ కప్ గెలవాలని అభిమానుల ఆకాంక్ష
- మ్యాచ్ తిలకించేందుకు బిగ్‌స్క్రీన్ల ఏర్పాటు

కడప స్పోర్ట్స్ : వరల్డ్ కప్ క్రికెట్‌లో ప్రస్తుతం భారత జట్టు వరుస విజయాలతో తిరుగులేదని నిరూపించుకుంది. ఓటమి అనే పదం తెలియకుండానే ప్రత్యర్థి జట్టును చిత్తు చేస్తూ ఫైనల్‌కు చేరింది. ఎక్కడా చూసినా అందరి నోటా ఒక్కటే మాట..ఇండియా వరల్డ్ కప్ పాట. ఇండియా–ఆస్ట్రేలియా జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ అహ్మదాబాద్‌లో జరగనున్న తరుణంలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో క్రికెట్ ఫీవర్. ఇండియా కప్ గెలవాలని ప్రతి భారతీయుడు దేవుళ్లకు మొక్కుకుంటున్నారు

రాయచోటిలో భారీ స్క్రీన్ ఏర్పాటు

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ వీక్షించేందుకు వీలుగా బిగ్‌స్క్రీన్ ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ 13 జిల్లాల్లో స్క్రీన్‌లను ఏర్పాటు చేసి అభిమానులను కనువిందు చేస్తోంది. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి వినతి మేరకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ రాయచోటిలో కూడా భారీ స్క్రీన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. మ్యాచ్ చూసేందుకు భారీగా అభిమానులు తరలి వచ్చే అవకాశం ఉన్న తరుణంలో శనివారం సాయంత్రం ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డితోపాటు మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు.

బారికేడ్ల ఏర్పాటు

కడపలోని ప్రభుత్వ పురుషుల కళాశాల మైదానం (ఆర్ట్స్ కళాశాల)లో వరల్డ్‌కప్ ఫైనల్ మ్యాచ్ వీక్షించేందుకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి కనువిందు చేయనున్నారు. క్రీడాభిమానులు, ప్రజలు మ్యాచ్‌ను వీక్షించేందుకు తరలిరానున్న నేపథ్యంలో జిల్లా పోలీసు ఉన్నతాధికారుల సూచనల మేరకు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్‌ఆర్ డిస్ట్రిక్ట్ ప్రతినిధులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రవేశం ఉచితం కావడంతో పెద్దసంఖ్యలో ప్రజలు విచ్చేయనున్న నేపథ్యంలో బారికేడ్లు నిర్మిస్తున్నారు. నిర్మాణపనులను శనివారం సీఏవైడీ అధ్యక్షుడు ఎం. భరత్‌రెడ్డి, కార్యదర్శి ఎ. రెడ్డిప్రసాద్, ప్రతినిధులు పి. సంజయ్‌కుమార్‌రెడ్డి, విష్ణుప్రీతంరెడ్డి, అబ్దుల్ ఫరూఖ్ రెహమాన్ పరిశీలించారు.



ముద్దనూరులో విన్ ఇండియా ఆకృతిలో విద్యార్థుల ప్రదర్శన

నెహ్రూ పార్కులో..

కడప కల్చరల్: క్రికెట్ ప్రేమికుల కోసం ఆదివారం కో ఆపరేటివ్ కాలనీలోని నెహ్రూ పార్కులో ఫైనల్స్ మ్యాచ్ వీక్షించే ఏర్పాటు చేస్తున్నామని లయన్స్ క్లబ్ ఆఫ్ అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షుడు గౌరీశంకర్ తెలిపారు.

ప్రత్యేక ప్రార్థనలు

కడప ఎడ్యుకేషన్ : వరల్డ్‌కప్ ఫైనల్లో భారత్ జట్టు విజయం సాధించి కప్పు గెలవాలని జే యూత్ వేల్ఫేర్ సొసైటి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత గురువు ఖాజాబాబా మాట్లాడుతూ టీం ఇండియా జాగ్రత్తగా ఆడాలన్నారు. గెలుపొందితే ప్రపంచ రికార్డు మన సొంతమవుతుందన్నారు.కార్యక్రమంలో వ్యవస్థాపకులు లయన్ పఠాన్ ఖాదర్ బాషా, రఫీ, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.



సెంచురీ పానెల్స్ పరిశ్రమ సందర్శన



పరిశ్రమ నిర్వాహకులతో చర్చిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

గోపవరం : సెంచురీ పానెల్స్ పరిశ్రమను శనివారం జిల్లా కలెక్టర్ విజయరామరాజు సందర్శించారు. ముందుగా కార్యాలయంలో పరిశ్రమ నిర్వాహకులతో జరుగుతున్న పనులపై చర్చించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు స్థానికులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఇప్పటి వరకు ఎంత వరకు ఏయే విభాగాలకు సంబంధించి ఉద్యోగ నియామకాలు చేపట్టారనే అంశంపై ఆరా తీశారు. అనంతరం పరిశ్రమలో జరుగుతున్న పనులను స్వయంగా పరిశీలించారు. ట్రైనీ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, ఆర్డీఓ వెంకటరమణ, తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఆర్‌ఐ అమర్‌నాథ్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అంజన్న సేవలో మాజీ డీజీపీ

చక్రాయపేట : గండి క్షేత్రంలో వెలసిన శ్రీవీరాంజనేయ స్వామిని శనివారం కేరళ రాష్ట్ర మాజీ డీజీపీ శంకరరెడ్డి తన కుటుంబసభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్‌లు వారిని సాదరంగా ఆహ్వానించి ఆలయ ప్రధాన అర్చకులు కేసరి, రాజా రమేష్, రాజగోపాలాచార్యులచే ప్రత్యేక పూజలు చేయించారు. స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించారు.



కేరళ మాజీ డీజీపీకి స్వామి వారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఆలయ అధికారి, చైర్మన్‌లు

నవశకం



ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో లబ్ధిదారులలో ఆనందం వెల్లివిరుస్తోంది.గతంలో జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగినా పనులు, మంజూరు కాని పథకాలు నేడు ఇంటికే వచ్చి చేరుతుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

జగనన్న సురక్షతో మేలు



మేము జమ్మలమడుగులోని బీసీ కాలనీలో నివాసం ఉంటున్నాం. 8ఏళ్లుగా తన కుమార్తె తనూజ పేరు రేషన్ కార్డులో ఎక్కించాలంటూ అధికారుల చుట్టూ తిరిగినా ఫలితంలేదు. ఆగస్టులో జరిగిన జగనన్న సురక్షలో వలంటీర్లు తన కుమార్తెను రేషన్ కార్డులో చేర్చుకోవటానికి అవకాశం వచ్చింది అని చెప్పి వెళ్లారు. వెంటనే దరఖాస్తు చేశాం. కేవలం నాలుగు రోజుల్లోనే అధికారులు పిలిచి కార్డు అందించారు. జగనన్న సురక్ష కార్యక్రమంతో మేలు జరిగింది. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

- పార్వతి, జమ్మలమడుగు

అందంగా పాఠశాలలు



నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి.ప్రైవేట్‌కు దీటుగా వసతులు కల్పించారు. విద్యార్థులకు డిజిట్ విద్య అందుతోంది.ముఖ ఆధారిత హాజరు వల్ల ఉపాధ్యాయులు సమయానికి పాఠశాలకు హాజరవుతున్నారు.బోధన మెరుగుపడింది. ఏటా విద్యార్థులకు జగనన్న విద్యా కానుకతోపాటు పుస్తకాలన్నీ ఉచితంగా సమకూర్చారు. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.

- పిట్టా వెంకట రమణ, జెడ్పీహైస్కూల్, చిలేకాంపల్లె,చక్రాయపేట మండలం

సొంతింటి కల సాకారం



మేము కడపలోని వై జంక్షన్‌వద్ద గల పక్కీరుపల్లె గ్రామంలో 35 ఏళ్లుగా నివసిస్తున్నాం. అనంతపురం జిల్లా ఉరవకొండ నుంచి వచ్చి ఇక్కడే స్థిరపడ్డాం. అనేకమార్లు రేషన్‌కార్డు, ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేస్తూ వచ్చాం. కానీ ఏ ప్రభుత్వం కూడా మమ్మల్ని పట్టించుకున్న పాపాన పోలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తర్వాత సొంతింటి కల సాకారమైంది. చాలా సంతోషంగా ఉంది.

- ముమ్మాల నాగమ్మ, పక్కీరు పల్లె

రేషన్‌కార్డు వచ్చింది



మాది కర్నూలు జిల్లా ఆదోని. మేము 2010లో కూలీ పనుల కోసం కడపకు వచ్చాం. మేము ఎన్నిమార్లు రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసినా ఏదో ఒక సాకు చూపుతూ తిరస్కరిస్తూ వచ్చారు. అయితే జగనన్న ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మాకు రేషన్‌కార్డు మంజూరైంది. పేదల సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళుతున్న జగనన్న మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నారు.

- గుంతప్ప శాంతి, కడప

బడుగు, బలహీన వర్గాలకు సామాజిక న్యాయం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్‌బాబు

మైదుకూరు : రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ తదితర బడుగు, బలహీన వర్గాలకు సామాజిక న్యాయం చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేనని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్ బాబు అన్నారు. మైదుకూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం సాయంత్రం సురేష్ బాబు, ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, సామాజిక సాధికార బస్సు యాత్ర రీజనల్ కోఆర్డినేటర్, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు ఎల్లారెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఈనెల 20వ తేదీ మైదుకూరులో నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు అయినా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ప్రాధాన్యత ఇచ్చిన ముఖ్యమంత్రులు లేరని అన్నారు. వారిని ఓటు బ్యాంకులుగానే గుర్తించారని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే వారికి సామాజిక న్యాయం చేశారని అన్నారు. అధికారంలోకి రాగానే సీఎం వైఎస్ జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఐదుగురికి ఉప ముఖ్యమంత్రి పదవులను ఇచ్చారని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్‌బాబు, చిత్రంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి తదితరులు

నామినేటెడ్ పోస్టుల్లోనూ 55 శాతం రిజర్వేషన్లు కల్పించారని అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నాయని చంద్రబాబు ఎల్లో మీడియా ద్వారా వైఎస్సార్‌సీపీ బీసీలను పట్టించుకోవడం లేదని ఆరోపించడం హాస్యాస్పదమన్నారు. చంద్రబాబు హయాంలో ఏనాడూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు న్యాయం జరగలేదని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ గతంలో చంద్రబాబు పాలన ఎలా ఉందో, ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఎలా ఉందో సామాజిక సాధికార బస్సు యాత్రలో ప్రజలకు వివరిస్తామని తెలిపారు. ఈనెల 20న మైదుకూరులో జరిగే బస్సు యాత్రకు హోం మంత్రి తానేటి వనిత, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని, జూపూడి ప్రభాకర్, పార్థసారథి, హఫీజ్ ఖాన్, బీద మస్తాన్‌రావు, జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ తదితరులు పాల్గొంటారన్నారు. కడప–కర్నూలు జాతీయ రహదారి బైపాస్‌రోడ్డులో ఉన్న కేఎస్‌సీ కన్వెన్షన్‌లో మంత్రులు, నాయకులు, వివిధ సంఘాల నాయకులు, మేధావులు తటస్థులతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో బహిరంగ సభ నిర్వహిస్తామని ఎమ్మెల్యే వివరించారు.

సామాజిక సాధికార బస్సు యాత్ర రీజనల్ కోఆర్డినేటర్, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను చంద్రబాబు వారి కుల వృత్తులకే పరిమితం చేశారని ఆరోపించారు. కులవృత్తులకు సంబంధించిన పరికరాలు మంజూరు చేసి వారిని సామాజికంగా, ఆర్థికంగా ఎదగనివ్వకుండా చేశారని ధ్వజమెత్తారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు బలహీన వర్గాలకు మేలు చేస్తున్నారని, రాజ్యాంగ పదవుల్లో రిజర్వేషన్లను కల్పించి పదవులు కట్టబెడుతున్నారని అన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు ఎల్లారెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఎంతో మేలు చేశారని, తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వార్షిక ప్రణాళిక సిద్ధం చేయాలి

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా సమగ్ర వార్షిక ప్రణాళికలను సిద్ధం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎద్దుల రాఘవరెడ్డి, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కడపలోని స్కౌట్‌హాల్‌లో వార్షిక బడ్జెట్ ప్రణాళిక 2024–2025 తయారీపై జిల్లా ఎంఐఎస్ కో ఆర్డినేటర్ లక్ష్మి నరసింహారాజు అధ్యక్షతన జిల్లాస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మండల విద్యాశాఖాధికారులు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, సీఆర్‌పీలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పిల్లలకు అతి ముఖ్యమైన వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ విద్యాహక్కు చట్టానికి అనుగుణంగా ప్రణాళిక ఉండాలన్నారు. ప్లానింగ్ కో ఆర్డినేటర్ లక్ష్మి నరసింహారాజు మాట్లాడుతూ ప్రణాళికలను కచ్చితమైన సమాచారంతో రూపొందించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఓ ఇలియాస్, ఐఈ కో ఆర్డినేటర్ కేశవరెడ్డి, ఏఎల్‌ఎస్ కో ఆర్డినేటర్ విశ్వనాథరెడ్డి, సీఎంఓ దశరథరామిరెడ్డి, అసిస్టెంట్ లేబర్ కమీషనర్ శ్రీనివాసులు, సీడీపీవో సునంద, జిల్లా సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు ధనలక్ష్మి, రమణమూర్తి, రామాంజులరెడ్డి, డీఈఓ కార్యాల ఏపీవో జాలాపతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ ఎద్దుల రాఘవరెడ్డి

క్లుప్తంగా

గ్రామ పాలనపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ సలహాదారు నాగార్జునరెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : గ్రామ పంచాయతీల్లో నిర్వహించాల్సిన పాలనపై అధికారులు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి అన్నారు. శనివారం జెడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, ఈఓపీఆర్ అండ్ ఆర్‌డీలకు నిర్వహించిన ఒక రోజు శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, రహదారులు వంటి సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాలన్నారు. విధుల నిర్వహణపై అవగాహన ఏర్పరుచుకుంటే గ్రామ పరిపాలన సవ్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, డీఎల్‌డీఓ వెంకట సుబ్బయ్య, జమ్మలమడుగు డీఎల్‌పీఓ విజయభాస్కర్, బద్వేలు డీఎల్‌పీఓ రమణారెడ్డి, కడప డీఎల్‌పీఓ మస్తాన్‌వలీ, పులివెందుల డీఎల్‌పీఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

స్కూటర్‌ను ఢీకొన్న బైక్



రోడ్డు ప్రమాదంలో గాయపడి శస్త్రచికిత్స చేయించుకున్న అనంతపద్మనాభరావు

కడప అర్బన్ : కడప వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజారెడ్డి వీధిలో శనివారం మధ్యాహ్నం స్కూటీలో వెళుతున్న ఇరువురిని ఓ బైకర్ ఢీకొనడంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. 'సాక్షి' దినపత్రికలో సీనియర్ సబ్–ఎడిటర్‌గా పనిచేస్తున్న అనంతపద్మనాభరావు, సునీల్‌లు వ్యక్తిగత పనుల నిమిత్తం స్కూటీలో నగరానికి వెళ్లారు. రాజారెడ్డి వీధిలోకి వెళుతుండగా వేగంగా వచ్చిన మోటార్‌సైకిల్ స్కూటీని కొనడంతో ప్రమాదం జరిగింది. దీంతో అనంతపద్మనాభరావు తీవ్రంగా, సునీల్ స్వల్పంగా గాయపడ్డారు. ఈ సంఘటనపై పోలీసులు విచారిస్తున్నారు. ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో అనంత పద్మనాభరావు కాలుకు శస్త్రచికిత్స చేశారు.

పాలస్తీనాపై దాడులు ఆపాలి



ప్రొద్దుటూరులో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



పుట్టపర్తి సర్కిల్‌లో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

ప్రొద్దుటూరు : పాలస్తీనాపై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులను ఆపాలని కోరుతూ ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ప్రొద్దుటూరులో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. వన్‌టౌన్ సర్కిల్ నుంచి గాంధీ రోడ్డు, టీబీ రోడ్డు మీదుగా పుట్టపర్తి సర్కిల్ వరకు జరిగిన ఈ ర్యాలీలో మహిళలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయిల్ వరుసగా దాడి చేస్తోందన్నారు. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత నుంచి ఏదో ఒక రూపంలో ఈ దాడులు జరుగుతున్నాయని తెలిపారు. ముస్లింలను దేశ ద్రోహులుగా చిత్రీకరిస్తున్నారన్నారు. బీజేపీ తొత్తులు సోషల్ మీడియాలో విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు పెడుతున్నారన్నారు. వాస్తవానికి పూర్వం ఇజ్రాయిల్ దేశమే లేదని, బ్రిటిష్ పాలకులు పనిగట్టుకుని సామూహిక వలసవాదులను ప్రోత్సహించి ఇజ్రాయిల్‌ను ఏర్పరిచారన్నారు. పాలస్తీనా నుంచి ఆ దేశ ప్రజలు పారిపోయేలా చేశారన్నారు. పాలస్తీనాలో చమురు గనులు ఉన్నాయని, వాటిపై ఆధిపత్యం కోసమే యుద్ధాలను ప్రోత్సాహిస్తున్నారన్నారు. అమెరికా లాంటి దేశాలు ఇజ్రాయిల్‌కు మద్దతు ఇస్తున్నాయన్నారు. జమా అతె ఇస్లామి హింద్ జిల్లా కార్యదర్శి ఎస్ఎస్ మొహిద్దీన్ ఖాన్ మాట్లాడుతూ 40 రోజులుగా పాలస్తీనాలో నరమేధం జరుగుతోందన్నారు. అతి కిరాతకంగా పిల్లలు, వృద్ధులను కూడా హతం చేస్తున్నారన్నారు. ప్రసార మాధ్యమాల్లో కూడా ఈ వార్తలు ప్రచురితం కావడం లేదన్నారు. ఇంటర్నేషనల్ మానిటరింగ్ ఫండ్ నుంచి ఇజ్రాయిల్‌కు డబ్బు సమకూరుతోందన్నారు. ఓపెన్ జైలు ఏర్పాటు చేసి లక్షలాది మందిని అందులో ఉంచి హింసిస్తున్నారని ఆరోపించారు. విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వరలక్ష్మి మాట్లాడుతూ పాలస్తీనాపై దాడులను అరికట్టేందుకు ప్రపంచ దేశాలు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి సుబ్బరాయుడు, ఎంపీజే రాష్ట్ర కార్యదర్శి సలీం, రచయిత ఎస్పీ మహమూద్, సృజన శ్రీను, ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి షరీఫ్, ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సందీప్, విక్రమ్, చైతన్య, మైనారిటీ మహిళా విభాగం నాయకులు ఆయేషా, హసీనా, టౌన్ బ్యాంకు వైస్ చైర్మన్ అక్రమ్, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంక్షేమం కోసం సొసైటీ ఏర్పాటు



కడప బార్ అసోసియేషన్ కార్యాలయంలో పూజలు చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి

కడప అర్బన్ : న్యాయవాదుల సంక్షేమం కోసం వారికి అన్ని విధాలుగా లబ్ధి చేకూర్చే విధంగా 'కడప న్యాయవాదులు మ్యూచువల్లీ ఎయిడెడ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ'ని సీనియర్ న్యాయవాది, కడప బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పి.ఎస్. బాలసుబ్రమణ్యం నేతృత్వంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి అన్నారు. శనివారం జిల్లా కోర్టులోని కడప బార్ అసోసియేషన్ సమావేశం హాల్‌లో సొసైటీ ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి సొసైటీకి సంబంధించి తయారు చేసిన బైలాస్ పుస్తకాలను ఆవిష్కరించారు. తొలుత సొసైటీ ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమాల్లో జడ్జి శ్రీదేవి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగవ జిల్లా అదనపు న్యాయమూర్తి దీనబాబు, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి జి.గీత, న్యాయమూర్తులు ఎం.ప్రదీప్ కుమార్, ఎస్.కవిత, న్యాయమూర్తులతోపాటు, కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.వి రాఘవరెడ్డి, సొసైటీ చీఫ్ ప్రమోటర్ జి.రామలింగారెడ్డి, కడప బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.టీ.జె కెనడీ, అసోసియేషన్ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

20 నుంచి టీటీడీ కార్తీక మాసోత్సవాలు

కడప కల్చరల్ : తిరుమల–తిరుపతి దేవస్థానాలు అనుబంధ సంస్థ హిందూ ధర్మ ప్రచార పరిషత్‌ల ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి కార్తీక మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని సంస్థ ప్రోగామ్ అసిస్టెంట్ గోపిబాబు తెలిపారు. శనివారం సంస్థ కార్యాలయంలో ఆయన విలేకరులకు వివరాలు తెలిపారు. ఏటా కార్తీకమాసంలో మన గుడి పేరిట నిర్వహించే ఈ ఉత్సవాలను వైఎస్సార్ జిల్లాతోపాటు అన్నమయ్య జిల్లాలో కూడా ఈ నెల 27వ తేది వరకు నిర్వహిస్తామని తెలిపారు. వైఎస్సార్ జిల్లాలో శ్రీ ఉమామహేశ్వర ఆలయం, బయనపల్లె, నాగిరెడ్డిపల్లె, సీకే దిన్నె మండలాల ఆలయాలలోనూ, అన్నమయ్య జిల్లాకు సంబంధించి శ్రీ పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరాలయం, మన్నూరు, రాజంపేటలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా వారం రోజులపాటు హరికథలు, ధార్మిక ప్రవచనాలు, భజనలు, కార్తీక పౌర్ణమిరోజున జ్వాలా తోరణం, దీపోత్సవం, తులసిమొక్కల పంపిణీ తదితర కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. రోజు సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ కార్యక్రమాలు ఉంటాయన్నారు. హాజరైన భక్తులందరికీ టీటీడీ దేవస్థానం ప్రమిదలు, దీపాలు, ఒత్తులు, నూనె, ఇతర పూజా ద్రవ్యాలను ఉచితంగా అందజేస్తారని, కార్యక్రమానంతరం అందరికీ తీర్థ ప్రసాదాలు అందజేస్తారన్నారు. 24న మంగళ కైశిక ద్వాదశి వ్రతం సందర్భంగా ప్రతిజిల్లా నుంచి రెండు ఎంపిక చేసిన దేవాలయాలలో విశేష పూజోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షులు సీహెచ్ విజయ్‌భట్టర్, ధర్మ ప్రచార మండలి సభ్యులు బెస్తవేముల రామమహేష్, ఏటూరి రామచంద్రారెడ్డి, ఎస్.చెన్నకృష్ణారెడ్డి, సీహెచ్ శివారెడ్డి, వై.దామోదరమ్మ, పలు దేవాలయాల ధర్మకర్తలు, శ్రీవారి సేవకులు, భజన బృందాలు తదితరులు పాల్గొన్నారు.

కులగణనలో ప్రజలు భాగస్వాములు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గణేష్‌కుమార్

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కుల గణన కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ కోరారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కుల గణన–2023 జిల్లా స్థాయి సదస్సులో ఆయన మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అర్హులందరికీ అందాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో అర్హత ఉన్నప్పటికీ కొంతమంది ఫలాలు పొందలేక పోతున్నారన్నారు. క్షేత్ర స్థాయిలోని ఈ సమస్యలన్నీ పరిగణనలోకి తీసుకునే రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. ఈనెల 27వ తేదీ నుంచి సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఓ వెంకట్రావు, డీఆర్వో గంగాధర్‌గౌడ్, పీఆర్‌ఆర్‌డీ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి, మైనార్టీ సంక్షేమ సలహాదారు మహమ్మద్ అలీ బొగ్దాది, హజ్ కమిటీ చైర్మన్ గౌసులాజం, పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ జింకా విజయలక్ష్మి, సగర కార్పొరేషన్ చైర్ పర్సన్ జి.రమణమ్మ, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకు వెళ్లి బియ్యం పంపిణీ చేయాలి

పులివెందుల టౌన్ : ఎండీయూ ఆపరేటర్లు లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి రేషన్ బియ్యం పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆర్డీఓ వెంకటేశులు, తహసీల్దార్ మాధవ కృష్ణారెడ్డి, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డిలతో కలిసి ఆయన ఎండీయూ ఆపరేటర్లు, రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎటువంటి అవకతవకలు లేకుండా పంపిణీ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సుజిత్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ గోవిందరావు మోరే, వీఆర్‌ఓలు, వీఆర్‌లు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె : రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత బియ్యం 100 శాతం పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని జేసీ గణేష్ కుమార్ అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో రేషన్ డీలర్‌లు, ఎండీయూ ఆపరేటర్‌లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆర్డీవో వెంకటేశ్వర్లు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

21న డీసీసీ బ్యాంక్ క్రెడిట్ క్యాంపు నిర్వహణ



డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్

కడప అగ్రికల్చర్ : కడప డీసీసీ బ్యాంకు ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన ఆ బ్యాంకు ప్రధాన కార్యాలయం ఆవరణంలో క్రెడిట్ క్యాంపును నిర్వహించి భూమి, ఇళ్లు తనఖాపై తిరిగి రుణం చెల్లించగల సామర్థ్యం ఉన్న వారికి రూ.35 లక్షల వరకు రుణాలను మంజూరు చేయడం జరుగుతుందని కడప డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన కడప డీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఆస్తిని తనఖాగా పెట్టుకుని ఖాతాదారుల అవసరం మేరకు పిల్లల చదువుకోసం, పిల్లల పెళ్లిళ్లు, ఆస్తి కొనుగోలు, ఇంటి మరమ్మతులు, వ్యాపారం లాంటి వాటి కోసం రూ.35 లక్షల వరకు రుణాలను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అలాగే గడప గడపకు కడప బ్యాంకు నినాదంతో ప్రతి ఇంటికి కడప బ్యాంకును పరిచయం చేయడంలో భాగంగా వచ్చే ఏడాది జనవరి 30వ తేదీ వరకు పొదుపు, కరెంట్ ఖాతాలను రూ.100 ఓపెన్ చేయడం జరుగుతుందన్నారు. ఖాతాలను ఓపెన్ చేసిన వారికి ఉచితంగా 2 లక్షల సురక్ష బీమా యోజనతోపాటు ఉచితంగా రూపే కార్డును కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. దీంతోపాటు పుట్టిన బిడ్డ నుంచి 15 ఏళ్లలోపు పిల్లలందరికీ రూ.100 లకే కిడ్డీ సేవింగ్స్ ఖాతా తెరిచి డబ్బులను దాచుకునేందుకు బాక్స్‌ను కూడా ఉచితంగా ఇస్తామని వివరించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు



గాయపడ్డ చంద్రమౌళి

పోరుమామిళ్ల : మండలంలోని నరసింగుపల్లె దగ్గర శనివారం సాయంత్రం మైదుకూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. కాశినాయన మండలం ఇటుకుళ్లపాడుకు చెందిన చంద్రమౌళి, రామానాయుడు బైక్‌పై పోరుమామిళ్లకు వస్తుండగా ఈ ఘటన జరిగింది. అదృష్టవశాత్తు ఇద్దరూ స్వల్పగాయాలతో బయట పడ్డారు. పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. చంద్రమౌళిని విచారించగా మైదుకూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయిందని, దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదన్నారు.

బస్‌షెల్టర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు



బస్‌షెల్టర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

వేముల : మండలంలోని దుగ్గన్నగారిపల్లె గ్రామం వద్ద శనివారం బస్‌షెల్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలలోకి వెళితే.. పులివెందుల నుంచి ఆర్టీసీ బస్సు కడపకు బయలుదేరింది. దుగ్గన్నగారిపల్లె గ్రామ సమీపానికి రాగానే ముందువైపు టిప్పర్, ఆటోలు వెళుతుండటంతోపాటు స్పీడ్ బ్రేకర్ ఉండటంతో బస్సు అదుపు తప్పి పక్కన ఉన్న బస్ షెల్టర్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో ప్రయాణికులకు ఎవరికీ ప్రమాదం జరగలేదు. అయితే బస్సు ముందుభాగం ధ్వంసమైంది. ఈ సంఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు

మహా పాదయాత్ర

మళ్లీ సీఎంగా జగనే కావాలంటున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు బసవరావు



పాదయాత్రలో పాల్గొంటున్న వారికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వేంపల్లె/వీరపునాయునిపల్లె : రాష్ట్రాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి విశేష కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎంగా కావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు కట్టెపోగు బసవరావు పేర్కొన్నారు. ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు ఆయన శుక్రవారం ప్రారంభించిన మహా పాదయాత్ర శనివారం వేంపల్లె, వీరపునాయునిపల్లె మీదుగా సాగింది. ఆయనకు సంఘీభావంగా వేంపల్లె సర్పంచ్, జేసీఎస్ మండల కన్వీనర్ ఆర్. శ్రీనివాసులు పాదయాత్రగా నడిచారు. కాగా, పాదయాత్ర చేస్తున్నవారికి వీరపునాయునిపల్లెలో కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికి అభినందించారు.

ఎన్‌సీసీ శిక్షణతో ఉజ్వల భవిష్యత్తు

వైవీయూ : ఎన్‌సీసీలో శిక్షణ పొందడం ద్వారా విద్యార్థులు క్రమశిక్షణ, దేశభక్తితోపాటు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు పడతాయని 30 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ థాపా పేర్కొన్నారు. కడప నగరం తెలుగుగంగ కాలనీలోని ఎన్‌సీసీ నగర్‌లో కంబైన్డ్ ఆన్యువల్ ట్రెనింగ్ క్యాంపును శనివారం ఆయన ప్రారంభించారు. 10 రోజుల పాటు ఈ శిక్షణ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు లెఫ్టినెంట్ ఆర్. నీలయ్య, మహేష్, పరేడ్ శిక్షకులు అశోక్, గోపాల్‌రెడ్డి, జగదీష్, సూపరింటెండెంట్ సరస్వతి, డేవిడ్, ఉమ, ప్రియ, రాజగోపాల్‌రెడ్డి, శివప్రసాద్, వివిధ జిల్లాల ఎన్‌సీసీ కేడెట్స్ పాల్గొన్నారు.

పోటీ ప్రపంచంలో ఉన్నతంగా ఎదగాలి



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో అతిథులు

కమలాపురం : ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదగాలని భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్) కోర్ అడ్వైజరీ సుబ్బలక్ష్మీ సాయిరమేష్, చీఫ్ మేనేజర్ హెచ్‌ఆర్ అడ్మిన్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఇంటర్నేషనల్ లిటిల్ స్టార్ ఒలంపియాడ్ వారు నిర్వహించిన పరీక్షలలో భారతి డీఏవీ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ పరీక్షల్లో 54 మంది గోల్డ్, ముగ్గురు సిల్వర్, ఒకరు బ్రాంజ్ సాధించి విజేతలుగా నిలిచారు. వారికి శనివారం అతిథులుగా వచ్చిన సుబ్బలక్ష్మీ, వేణుగోపాల్ రెడ్డి చేతుల మీదుగా మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. భారతి డీఏవీ స్కూల్‌ను ఉన్నత స్థానంలో నిలుపుతున్న ప్రిన్సిపల్ కిషోర్ కుమార్‌ను, ఉపాధ్యాయులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఏవీ సౌత్‌జోన్ ప్రాంతీయ అధికారి వీఎస్ఎన్‌కె శేషాద్రి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కమలాపురం : మండలంలోని పెన్నా నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. శనివారం గంగవరం సమీపంలోని పెన్నా నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న సమాచారం రావడంతో ఎస్ఐ తన సిబ్బందితో కలసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.